ప్రజాతంత్ర
తెలంగాణ దినపత్రిక

# మహిళలు సాధికారత సాధించాలి





## మేయర్ గుండా ప్రకాశరావు

వరంగల్ సిటీ, ఆగస్టు 27, (ప్రజాతంత్ర విలేకరి) : మహిళల సాధికారత చాలా ముఖ్యమని దీని సాధన దిశగా అడుగులు వేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండా ప్రకాశరావు అన్నారు. మంగళవారం అర్బన్ శిక్షణ కేంద్రం, బల్దియా సహకారంతో ఏర్పాటు చేసిన మహిళా సుతారి శిక్షణను బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్లో మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సుతారి శిక్షణ దేశంలోనే మొదటిదిగా వరంగల్‌లో చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. కుటుంబానికి మహిళలు తమ వంతు ఆర్థిక సహాయం చేసే దిశగా ఎదగాలని ఆయన అన్నారు. మహిళలు తమలోని నైపుణ్యాన్ని శిక్షణ ద్వారా మెరుగుపర్చుకొని, పనితీరులో అభివృద్ధి సాధించాలన్నారు. నైపుణ్యం పెంచుకుంటే అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి మహిళలు తమ కాళ్ళమీద తాము నిలబడేలా చేయాలనే శిక్షణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ మూడు రోజుల పాటు జరుగుతుందని టాయిలెట్ల నిర్మాణంలో మెళకువలు అనుభవజ్ఞులైన రాజస్థాన్, ఢిల్లీల నుండి వచ్చిన సుతారీలు శిక్షణ ఇస్తారని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. వరంగల్ నగరం స్మార్ట్ సిటీ హృదయ్, అమృత్ పథకాల ద్వారా ఎంతో అభివృద్ధి చెందనుందని మేయర్ అన్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహాయంతో ప్రపంచంలో 8 నగరాలు సంపూర్ణ పారిశుద్ధ్యానికి ఎంచుకోగా, అందులో వరంగల్ నగరం ఒకటని, జపనీస్ బృందం నగరంలో పర్యటించిందని, త్వరలో మురుగు నీటి శుద్ధీకరణ ప్రక్రియ, సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్లాస్టిక్ నిషేదాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. మహిళలు పేపర్, జూట్ సంచుల తయారీపై దృష్టి పెట్టాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత చాలా ముఖ్యమని దీనిపై అవగాహన కల్పించి చైతన్యం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా అదనపు కమిషనర్ నాగేశ్వర్, ఇంచార్జి టిపిఆర్వో, బల్దియా కార్యదర్శి విజయలక్ష్మి, ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, పర్యవేక్షకురాలు ప్రసన్నరాణి, జాతీయ పట్టణ ఉపాధి పథకం రాష్ట్ర కోఆర్డినేటర్ రవికిరణ్, వరంగల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, సివోలు తదితరులు పాల్గొన్నారు.